తిరుపతి - చిత్తూరు
30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# రూలింగ్ ఉంది కదప్పా... నిలబడితే పోలే!

**- కుప్పంలో అప్పుడే మొదలైన ఎన్నికల సన్నాహాలు- మున్సిపల్ చైర్మన్ 'గిరీ' పై కన్నేస్తున్న ఆశావహులు**

కుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గంలోని కుప్పం మున్సిపాలిటీలో అప్పుడే ఎన్నికల సన్నాహాలు నాయకులు మొదలుపెట్టారు. ప్రస్తుత మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం ఈ ఏడాది నవంబర్ నాటికి ముగియనుంది. అంతలోపే కుప్పం మున్సిపాలిటీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఎన్నికల్లో నిలబాలనుకుంటున్న నాయకులు ఇప్పటినుంచే సన్నాహాలు మొదలు పెట్టారని తెలుస్తోంది. ఒక పక్క రాష్ట్రంలో సిఎంగా చంద్రబాబునాయుడు, అధికారంలో కూటమి ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో ప్రతిష్టాత్మకమైన కుప్పం మున్సిపల్ చైర్మన్ గిరీని ఎలాగైనా దక్కించుకోవాలని ఆశావహులు పావులు కదిపేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.

**ఆశావహుల జాబితాలో చాలామంది:**

మున్సిపల్ చైర్మన్ గిరీని ఆశిస్తున్న జాబితాలో చాలామంది ఉన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం కౌన్సిలర్లుగా కొనసాగుతున్న కొంతమంది నాయకులతో పాటు మరికొందరు అధికార పార్టీ నేతలు సైతం చైర్మన్ పదవి రేసులో నిలవాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. దీంతో పాటు కౌన్సిలర్లుగా కూడా అదే వార్డుల్లో నేతల మధ్య గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఒక్కో వార్డులో మూడు నుంచి నాలుగుపేర్లు వినబడుతున్నాయి. ఈదఫా చైర్మన్ ఎన్నిక ప్రత్యక్షంగా జరగనున్న నేపథ్యంలో ప్రస్తుతం ఆశావహులుగా ఉన్న వారు తమ అదృష్టం పరీక్షించుకోవాలని ఎదురుచూస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఆశావహుల్లో పోటీ సైతం అంతే స్థాయిలో నెలకొంటోంది. అయితే కౌన్సిలర్లతో సహ చైర్మన్ పదవిని నిర్ణయించే విషయంలో సిఎం చంద్రబాబునాయుడే తుది నిర్ణయం కనుక సిఎం ఎవరికి అవకాశం కల్పిస్తారో అనే ఉత్కంఠ సైతం నాయకుల్లో ఇప్పటినుంచే మొదలైంది.

**మున్సిపాలిటీలో పెరగనున్న వార్డులు :**

కుప్పం మున్సిపాలిటీలో దాదాపు 40వేలకు పైబడి జనాభా ఉన్నారు. ఈ నేపథ్యంలో 2021 ఎన్నికల సమయంలో మున్సిపాలిటీని 25వార్డులుగా విభజించారు. అయితే ప్రస్తుతం వార్డుల పునర్విభజన చేపట్టగా అదనంగా మరో 7వార్డులు కొత్తగా ఏర్పడి 32వార్డులకు మున్సిపాలిటీ ఎన్నికలు జరగనున్నాయి.

# తిరుపతిలో...పోలీస్ కమిషనరేట్!

**మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యత**

- జిల్లాలో క్రైం రేటు తగ్గింది
- రూ.2.70 కోట్లతో 8,480 చదరపు అడుగులవిస్తీర్ణంలో నిర్మాణం
- డ్రోన్ కెమెరా ద్వారా తనకు తీవ్ర గాయాలయ్యాయి అనే వార్తలు అవాస్తవం
- రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత


మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని రాష్ట్ర హోం మంత్రి

తిరుపతి క్రైమ్ ఆగస్టు 24 ప్రభాతవార్త: మహిళల భద్రతకె ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. తిరుపతి నగరంలో నూతనంగా నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని రాష్ట్ర హోం శాఖమంత్రి వంగలపూడి అనిత తన సహచర మంత్రులు, యమ్‌ల్‌ఏలు అయి న జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీని వాసులు, పులివర్తి నాని, ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, ఆరవ శ్రీధర్, జిల్లా కలెక్టర్ డాక్టం ఎస్.వెం కటేశ్వర్, ఎస్పీ ఎల్.సుబ్బారాయుడులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ మహిళల భద్రతకు కూటమిప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తిరుపతి దేశ, విదేశాల నుంచి భక్తులు నిత్యం వచ్చే ప్రముఖ ఆధ్యాత్మి కనగరమని, మహిళా పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం అవసరాన్ని గుర్తించి సుమారు రూ.2.70 కోట్లతో 8,480 చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన భవనాన్ని నిర్మించినట్లుతెలిపారు. మహిళలు, చిన్నారులు, కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు అధికంగా వసున్న నేపథ్యంలో అనుకూలమైన వాతావరణంతో పాటు ప్రత్యేక కౌన్సెలింగ్ సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారానికి రెండు సార్లు మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేయడంతో పాటు సాధ్యమైనంత వరకు కౌన్సెలింగ్ ద్వారా కుటుంబ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసుల సంఖ్య తగ్గుముఖంపట్టిందని మంత్రి తెలిపారు. గత ఏడాది 94 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 58 కేసులు నమోదైనటు వివరించారు. రాష్ట్రంలోమొత్తం నేరాల రేటు సుమారు 14 శాతం తగ్గిందని, విజిబుల్, ఇన్విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయడంతో పాటు పోలీస్ శాఖకు మౌలిక వసతులు, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో మహిళా పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం ఉండేలాదశలవారీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తిరుపతికి పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు ప్రతిపాద నపరిశీలనలో ఉందని, సిబ్బంది కొరత, పని ఒత్తిడి అంశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. మహిళల భద్రత, పోలీస్ శాఖ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.డ్రోన్ ద్వారా ఎటువంటి ఫ్రాక్చర్ కాలేదు డ్రోన్ కెమెరా తన చేతికి తగలడంతో తీవ్ర గాయాలయ్యాయని సోషల్ మీడియా కథనాలను నమ్మకండి అని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. డ్రోన్ కెమెరా తన చేతికి తాకడం వాస్తవమే అని అయితే తనకు ఎటువంటి తీవ్ర గాయాలు కాలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీలత, శ్రీనివాస్, శ్రీనివాసులు, డీఎస్పీలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ మండపం ఆదాయంతోనే... జీతాలు

# చెరుకు సాగు తగ్గడంతోనే నష్టాలు

ఆధునీకరించిన షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపంను ప్రారంభించిన ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే గురజాల, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లు


ఆధునీకరించిన షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపంను పునఃప్రారంభిస్తున్న దృశ్యం

చిత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త: చిత్తూరు సహకార చెక్కర ఫ్యాక్టరీ కళ్యాణ మండపంను ఆధునీకరించి తిరిగి వినియోగంలోకి తీసుకు రావడం ద్వారా వచ్చే ఆదాయంను కనీసం సిబ్బంది జీతాలకైనా వినియోగించాలనే ఉద్దేశంతో కళ్యాణ మండపంను ఆధునీకరించి ప్రారంభించినట్లు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ఆధునీకరించిన చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపంను సోమవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జనగ్మోహన్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లు ప్రారంభించారు. జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ కళ్యాణ మండపంను గతంలో పరిశీలించిన సమయంలో దాని పరిస్థితిపై అధికారులు సిఫార్సు చేసిన నేపథ్యంలో షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను పరిరక్షించడంతో పాటు కళ్యాణ మండపం నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. అలాగే చిత్తూరు సహకార చక్కెర ఫ్యాక్టరీ సమస్యను సైతం పరిష్కరించాల్సి న అవసరం ఎంతైనా వుందని, అనేక సంవత్సరాలుగా ఫ్యాక్టరీ సమస్య కొనసాగుతుందన్నారు. ఫ్యాక్టరీ పరిధిలో చెరకు సాగు తగ్గిపోవడం, ముడి సరుకు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో ఫ్యాక్టరీ కార్యకలాపాలు దెబ్బతిన్నాయన్నారు. ఫ్యాక్టరీపైఅప్పులు, వాటిపై పెరుగుతున్న వడ్డీల కారణంగా భవిష్యత్తులో ఆస్తుల విలువ కంటే అప్పులు అనేక రెట్లు పెరిగే అవకాశం వుందన్నారు. ఈ సమస్యను ఆలస్యం కాకుండా పరిష్కరించాల్సి న అవసరం వుందని, ఈ విషయంపై ఎమ్మెల్యేతో పాటు తాను సహకారం అందిస్తానన్నారు. ఫ్యాక్టరీ డైరెక్టర్లు, రైతులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకుని సమస్యను పరిష్కరించడానికి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ కళ్యాణ మండపంను తాను పరిశీలించిన సమయంలో పరిస్థితి దారుణంగా వుండేదని, సీపేజ్, పెయింటింగ్, లైటింగ్, ఫ్యాన్లు తదితర మౌళిక సదుపాయాలు సైతం సరిగా లేదని, అయితే చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపంకు గొప్ప చరిత్ర వుందన్నారు. కళ్యాణ మండపంకు గత వైభవం తీసుకురావాలని నిర్ణయించి కలెక్టర్ సుమిత్‌కుమార్ సహకారంతో, సంస్థకు అందుబాటులో వున్న నిధులను వినియోగించుకుని రూ.20 లక్షలతో కళ్యాణ మండపంను ఆధునీకరించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలల్లోనే చిత్తూరు ప్రజలకు ఉపయోగపడే పలు కార్యక్రమాలు చేపట్టారన్నారు. షుగర్ ఫ్యాక్టరీకి ఛైర్మన్‌గా వున్న జాయింట్ కలెక్టర్ కళ్యాణ మండపంను పరిశీలించి దీనిని అభివృద్ధి చేస్తే ప్రజలకు ఉపయోగపడుతుందని భావించి ఆధునీకరణకు చర్యలు చేపట్టారన్నారు. చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, షుగర్ ఫ్యాక్టరీ మాజీ ఛైర్మన్ దుర్గా రామకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఎం.నాగేశ్వరరాజు, రైతులు కొత్తూరు బాబు, శ్రీనివాసులునాయుడు, జి.ముత్యాలు, ఫ్యాక్టరీ ఇన్‌ఛార్జీ ఎండి, కూటమి నాయకులు, అధికారులు, పుర ప్రముఖులులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా అభివృద్ధికి...

# సమగ్ర ప్రణాళికతో ముందుకు

**-జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్**

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 24 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మరింత వేగం చేకూర్చడంతో పాటు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి సాధించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఇన్‌ఛార్జి మంత్రి సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అధ్యక్షతన డిఆర్‌సి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు, ఎమ్ ఎల్ సిలు బల్లికల్యాణ చక్రవర్తి, రాంభూపాల్ రెడ్డి, తిరుపతి చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, కోడూరు, వెంకటగిరి, గూడూరు శాసన సభ్యులు అరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, అరవ శ్రీధర్, కె.రామకృష్ణ, పాశం సునీల్, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహా యాదవ్, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆర్. సదాశివం, డిసిసి చైర్మన్ అమాషా రాజశేఖర్ రెడ్డి, ఏపి బెస్త కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్, ఏపి మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా.శ్రీహరిరావు, ఖాదీ, గ్రామ ఇండస్ట్రీస్ బోర్డు చైర్మన్ కె.కె.చౌదరి, ఆంధ్రప్రదేశ్ మినిమం వేజెస్ అడ్వైసర్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, ఎస్విబిసి చైర్మన్ శ్రీధర్ వర్మ, జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్, ఎస్పి ఎల్.సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, మున్సిపల్ కమీషనర్ ఎమ్.జయకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీఓలు తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట రామ్మోహన్, భాను ప్రకాష్‌రెడ్డి, దేవేంద్ర రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సానుకూల అభిప్రాయం ఏర్పడిందన్నారు. రేణిగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు, మామిడి సాగు అభివృద్ధి, భూసేకరణ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాల్సి న అవసరం ఉందన్నారు. ఎస్ఎస్ కెనాల్, డయాలసిస్ కేంద్రం, అరవపల్లె ప్రాజెక్టు, రుయా ఆసుపత్రి, చంద్రగిరి-పాకాల పాత రహదారి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల సంఘం పరిధిలో 89 పంచాయతీలకు సంబంధించిన సమస్యలపై తాను సంబంధిత అధికారులతో మాట్లాడి తిరిగి సమాచారం అందిస్తానన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి టీటీడీ నుంచి రావాల్సి న నిధుల అంశాన్ని కూడా పరిష్కరించేందుకు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ పూర్తి వివరాలు తెలుసుకుని కలెక్టర్, ఇతర అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మామిడి ఆర్చర్డ్స్‌లో క్రాప్ రొటేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులకు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను భూ సంబంధిత అంశాల్లో ప్రత్యేకంగా గుర్తించి చూపించాలని కలెక్టర్ కు సూచించారు. గ్రామకంఠాల సమస్యను ప్రత్యేక అంశంగా తీసుకుని ఆర్‌డీఓ స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 22ఏ భూముల సమస్యల పరిష్కారంలో చేపట్టిన చర్యలను ప్రస్తావిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. తుడా చైర్మన్ మాట్లాడుతూ తిరుపతిలో స్థానిక అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఆర్టీఐ భవన నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ, డీడీ ప్రక్రియ పూర్తయి, లేఅవుట్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షపాతం, నీటి నిల్వలు, వ్యవసాయ పరిస్థితులపై వివరిస్తూ, ఈ వర్షాకాలంలో జిల్లాలో 35.5 శాతం వర్షపాతం లోటు నమోదైనప్పటికీ, రాష్ట్ర సగటు లోటుతో పోలిస్తే పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు. గత రెండేళ్లలో అధిక వర్షపాతం నమోదవడంతో జిల్లాలోని చెరువుల్లో ప్రస్తుతం సరిపడా నీటి నిల్వలు ఉన్నాయి. జిల్లాలో సుమారు రూ.7,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, వివిధ రైల్వే లైన్ల డబ్లింగ్, 3వ-4వ లైన్ పనులు, కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారి ప్రాజెక్టులకు చర్యలు వేగవంతమ య్యాయన్నారు. ఎస్పి సుబ్బ రాయుడు మాట్లాడుతూ తిరుపతి జిల్లా పోలీస్ యంత్రాంగం నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు మాదకద్రవ్యాల నిర్మూలనలో గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. జిల్లాలోని 7 జాతీయ రహదారులు, 11 రాష్ట్ర రహదారుల పై బ్లాక్ స్పాట్ల గుర్తింపు, రహదారి నిర్మాణం, నిఘా పెంపుతో ప్రమాదాలు తగ్గించబడుతు న్నాయన్నారు. నమోదైన కేసుల్లో 60-90 రోజుల్లో చార్జ్‌షీట్లు దాఖలు చేసి 80 కేసులు డిస్పోజ్ చేశారన్నారు. మహిళలు, చిన్నపిల్లల పై లైంగిక దాడుల కేసుల్లో నిందితులపై ప్రత్యేకంగా రౌడీ షీట్లు ఓపెన్ చేస్తున్నారన్నారు చిత్తూరు ఎంపి మాట్లాడుతూ జిల్లా వివిధ పథకాల కింద ప్రభుత్వం కేటాయించే బడ్జెట్, ఖర్చు వివరాలను భవిష్యత్తు సమావేశపు నివేదికల్లో పొందుపరచాలన్నారు. ఎంఎల్‌సి రామ్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడుతోందని, ప్రభుత్వ సూచించిన మేరకు శుభ్రమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీకాళహస్తి ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ఎన్‌టిపిసి, బిహెచ్‌ఈఎల్‌కు కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని జిల్లాలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు భూములను కేటాయించాలన్నారు. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దయాలిసిస్ కేంద్రం బాగుందని, అయితే మౌళిక వసతుల కోసం రూ.40 లక్షల నిధులు అవసరమన్నారు. చంద్రగిరి ఎంఎల్‌ఏ మాట్లాడుతూ వివిజిరామ్‌జి కింద చేపట్టే పనులకు సంబంధించి జిల్లాలోని శాసన సభ్యుల నుండి ముందస్తుగా ప్రతిపాదనలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మరిన్ని ఎక్కువ గోకులం షెడ్లు అవసరమని, అదనపు గోకులం షెడ్ లను మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చంద్రగిరి-పాకాల పాత రహదారిలో బస్సులు వెళ్ళడం లేదని, హైవే లో వెళుతోందని, దీనిపై ఆర్ టి సి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కోడూరు ఎంఎల్‌ఏ మాట్లాడుతూ కోడూరు నియోజకవర్గంలో ఉద్యాన పంటల సాగు ఎక్కువగా ఉందని, పంట ఉత్పత్తుల తరలింపుకు అనుగుణంగా మట్టిరోడ్డు నిర్మాణాలు చేపట్టాలన్నారు. చిట్వేల్ పాఠశాలలో తాగు నీటి కొరతను తీర్చాలన్నారు. తిరుపతి ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వినాయక సాగర్‌ను తుడా నిధులతో అభివృద్ధి చేయాలన్నారు. తిరుపతి పట్టణంలోని మంగళం పరిసర ప్రాంతాలలో త్రాగు నీటి పైప్ లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సూళ్లూరుపేట ఎంఎల్‌ఏ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉందని, వైద్య సిబ్బంది కొరతు భర్తీ చేయాలని కోరారు. సత్యవేడు ఎంఎల్‌ఏ ఆదిమూలం మాట్లాడుతూ కాళంగి రిజర్వాయర్ కట్ట బలహీన పడిందని, రిజర్వాయర్ కట్ట తెగిపోతే నీరంతా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ప్రాంతాలకు నష్టం కలుగుతుందని, రిజర్వాయర్ కట్ట బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సత్యవేడు ఆర్టీసీ డిపో సిబ్బంది కొరతను తీర్చాలన్నారు. ఆగిపోయిన ఆరణియార్ ప్రాజెక్టు అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించాలన్నారు. గూడూరు ఎంఎల్‌ఏ సునీల్ కుమార్ మాట్లాడుతూ క్రిస్‌సిటీ నష్ట పరిహార చెల్లింపుల్లో అవకతవకలు ఉన్నాయని, దీనిపై విచారణ చేపట్టాలన్నారు. పిజిఆర్ స్ ద్వారా లిటిగెంట్లు జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పిస్తున్నారని, దానిపై క్రింది స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను గుర్తించి నిజమైన అర్జీదారులకు న్యాయం చేకూర్చాలన్నారు. వాకాడు ప్రాంత మత్స్యకారుల కోసం మట్టి రోడ్డు నిర్మించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

# శ్రీరాముల వారి భూముల కుంభకోణం!

**-రూ.150కోట్ల విలువ కల్గిన భూములు స్వాహా -మాజీ ఎంఎల్‌ఏ ఘాటు విమర్శ**



మీడియాతో మాట్లాడుతున్న బియ్యపుమధుసూధనరెడ్డి

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో అక్రమణల రాజ్యమేలు తుందని, దేవస్థానం భూములకు రక్షణ లేదని శ్రీకాళహస్తి మునన్సిపాలిటికి కూత వేటు దూరంలో ఎంఎం వాడ సమీపంలో 'శ్రీరామచంద్ర మూర్తికి సంబంధించిన' రూ.150కోట్లు విలువ చేసే భూములను తెలుగు తమ్ముళ్ళు తమ కబంధహస్తాల్లో పట్టుకున్నారని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ ఈ కుంభకోణం శ్రీకాళహస్తి నుంచి రాష్ట్రం, కేంద్రం వరకు నాయకుల హస్తం ఉందని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై విచారణ జరిపి అందరినిజైల్లో పెట్టిస్తామంటూ హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తుల్ని కాపాడటంలో అధికారులు నిస్సహాయు లౌతున్నారని మధుసూధనరెడ్డి ధ్వజమెత్తారు. ఆయోధ్యరాముడు శ్రీరామచంద్రుని పేర ఉన్న భూములను దళితులకు సంబంధించిన భూములకు నకిలి పత్రాలు తయారు చేసి అక్రమించు కున్నారని తీవ్ర ఆరోపణలు చేసారు. దేవుడి భూములు,మాతమ్మ భూములు ఆక్రమించుకోవటంలో ఎవరి హస్తం ఉందో బయటికి తీస్తామన్నారు. వీటికి సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని అవసరం అవకాశం వచ్చినపుడు బయట పెడతామన్నారు.ఈ దేవుని భూములను కాపాడటంలో తనపై ఎన్నికేసులు పెట్టినా జైలుకు పంపినా వెనుకాడనని సవాల్ విసిరారు. ఈ భూములకు సంబంధించి పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి, స్వామీజీలతో ఆందోళన చేపట్టగలమన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంటి ముందు స్వామీజీలతో ఆందోళనకు దిగుతామని ప్రకటించారు. నేడు అక్రమంగా నిర్మిస్తున్న అపార్టుమెంట్లు భవిష్యత్తులో ప్రజలకే చెందుతాయని తెలిపారు. ప్రజలు ఇక్కడ కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. రాజీవ్‌నగర్‌లో అక్రమ ఆక్రమణలంటూ కొన్ని భవనాలు రాత్రికి రాత్రే కూలగొట్టారు కదా మరి ఈ కుంభకోణాలేమిటని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్నా రాజీవ్‌నగర్‌లో కుంభకోణాలపై స్పష్టత లేదేమిటి? మాటలతోకాలం గడుపుతూ ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారని బియ్యపు మధుసూధనరెడ్డి ధ్వజమెత్తారు.

**శాంతి భద్రతలు ఎక్కడ...రౌడీయిజం పెరిగిపోతుంది:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వరుస సంఘటనలు గమనిస్తేఏం జరుగుతుందో అంతుపట్టని పరిస్థితి చోటు చేసుకుంది. గంజాయి సేవించే వారు ఎవరి మీద ఎటు నుంచి దాడి చేస్తున్నారో అర్థం కావటంలేదు. గంజాయి మత్తులో ఉన్న వాడికి ఫలానా వ్యక్తి మీద దాడి చేస్తున్నాననే భావం ఉండదన్నారు. ఏదో సంఘటన జరిగినపుడు పోలీసులు హంగామా చేయటం కాదు. నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా పోలీసు అధికారులు చక్కగా స్పందిస్తున్నారు. కానీ స్థానికంగా సామాన్యులకు ప్రతి రోజూ శిక్షగానే మారిందన్నారు. రౌడీయిజాన్ని ఉక్కు పాదాలకింద నలిపేస్తామంటున్న పాలకులకు ఈనెలలో ఎన్ని సంఘటనలు జరిగాయో తెలియదా? అని బియ్యపు మధుసూధనరెడ్డి ప్రశ్నించారు.ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పార్టీ ప్రముఖులు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన...

# రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు



తిరుపతి క్రీడ, ఆగస్టు 24 ప్రభాతవార్త : తిరుపతిలోనీ ఎస్వి యూనివర్సిటీ లోని తారకరామా గ్రౌండ్‌లో నిర్వహించిన అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్ర స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత గారు, క్రీడల శాఖ మంత్రి మండేపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి శాప్‌చైర్మన్ రవినాయుడు పోటీలను ప్రారం భించారు. జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన మ్యూజికల్ డ్యాన్స్ కార్యక్రమాలు ఆకట్టు కున్నాయి. అనంతరం శాప్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)తరపున స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తరఫున క్రీడాకారులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి అంటే ఇప్పటివరకు కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి గుర్తుకు వచ్చేవారని, ఇకపై తిరుపతి అంటే క్రీడలకు, క్రీడా ప్రాంగణాలకు నిలయంగా గుర్తింపు పొందేలా అభివృద్ధి చేస్తున్నామని రవి నాయుడు తెలిపారు. యువ నాయకుడు నారా లోకేష్ పాదయాత్ర సమయంలో తిరుపతిలోని విద్యార్థులు తమకు సరైన క్రీడా మైదానాలు లేవని కోరారని గుర్తుచేశారు. తిరుపతిలో ఏడు విశ్వ విద్యాలయాలు, సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు ఉన్న నేపథ్యంలో క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించి క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు.ఆ హామీలో భాగంగా తిరుపతిలోని గొల్లవాని గుంటలో క్రీడా ప్రాంగణాన్ని నిర్మించి లోకేష్ చేతుల మీదుగా ప్రారంభిం చామని చెప్పారు. నందమూరి తారక రామారావు స్థాపించిన మహిళా విశ్వవిద్యాలయంలో ఎన్టీఆర్ పేరుతో ఇండోర్ స్టేడియాన్ని ఏర్పాటు చేశామని, ఎస్వీ యూనివర్సిటీలో కూడా క్రీడా మౌలిక వసతులను పునరుద్ధరించి స్పోర్ట్స్ కాంప్లెక్స్, అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అమరా వతి ఛాంపియన్‌షిప్-2026లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2,07,498 మంది క్రీడాకారులు పాల్గొన్నారని రవి నాయుడు తెలిపారు. జిల్లాస్థాయిలో సుమారు 90 వేల మంది, రాష్ట్రస్థాయిలో సుమారు 10 వేల మంది క్రీడా కారులు పాల్గొంటున్నారని చెప్పారు. అండర్17, అండర్ 23 విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు వేదికగా తిరుపతిని ఎంపిక చేయడానికి పలు ప్రాంతాలను పరిశీలించి నప్పటికీ, క్రీడలకు అను కూల వాతావరణం, అవసరమైన మోలిక సదుపాయాలు, సహకారం అందించే పరిస్థితులు ఉన్నందున తిరుపతిని ఎంపిక చేసినట్లు రవి నాయుడు వెల్లడిం చారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రివర్యులు అనగానే సత్యప్రసాద్ మాట్లా డుతూ దేశభక్తి, జాతీయ సమైక్యతతో యువత ముందుకు సాగాలని, శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. "క్రీడలతో విద్య-విద్యతో ఉద్యోగం నినాదంతో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా అకాడమీలు ఏర్పాటు చేసి యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేతలకు రూ.7 కోట్ల ప్రోత్సాహకం అందిస్తున్నామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ఎదిగి పతకాలు సాధించాలని క్రీడాకారులకు ఆకాంక్షించారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ క్రీడలు శారీరక ఉల్లాసంతో పాటు మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరమని, ఇదివరకు తల్లిదండ్రులు క్రీడలు ఆడితే చదువుకోవడం పాడుఅవుతుందని భ్రమలో ఉండేవారని కానీ ఇప్పుడు ఇప్పుడు పూర్తిగా తల్లిదండ్రుల మార్పు వచ్చిందని తెలిపారు.రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రామప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్‌ఆధ్వర్యంలో క్రీడారంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని అనిత అన్నారు. వివిధ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, బోర్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నా ఓటుకే రక్షణ లేదు

### -కమిషనర్‌కు వినతి పత్రం అందించిన మాజీ ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి వాసిని ఐదేళ్ళు శాసన సభ్యుడుగా ప్రజా సమస్యలను పరిష్కరించాను. కరోనా కాలంలో ప్రజలకు అండగా నిలిచాను. అయితే ఓటర్ల జాబితాలో తన కుటుంబసభ్యుల ఓట్లే గల్లంతయ్యే ప్రమాదం చోటు చేసుకుందని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. సోమవారం ఆయన తన అనుచరులతో కలసి శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డిని కలసి 'సర్' కార్యక్రమాలు సజావుగా నిర్వహిస్తున్నందుకు అభినందించారు. అయితే తన కుటుంబ సభ్యులకు సంబంధించిన పేర్లను పరిశీలించగా ఓటర్ల జాబితాలో లోపాలు బయటపడ్డాయని కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఒక మాజీ ఎంఎల్‌ఏ, వారి కుటుంబసభ్యుల ఓట్లకే రక్షణ లేకుండా ఇక సామాన్యుల,దివ్యాంగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరగాలని ఈ మేరకు పరిశీలకులు చొరవ చూపాలని కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. నేడు ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఈ విషయాన్ని జనం తెలుసుకున్నారని మధుసూధనరెడ్డి వివరించారు. ఓటరు జాబితాపైనే ప్రభుత్వం అందిస్తున్న పథకాల మంజూరు ఆధారపడి ఉంటుందన్నారు. కాబట్టి అధికారులు అందుబాటులో అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా చూడాలని కోరినట్లు మీడియాకు వివరించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో అధికారులు బాగానే పని చేస్తున్నా ఓ మాజీ శాసనసభ్యుడుగా ఆరునెలలుగా వీధి దీపాలు వెలగటం లేదంటూ పట్టించుకునే దిక్కులేదు. ఇంటి ముందు చెత్త తొలగించమంటే అడుక్కోవాల్సి వస్తుంది. తాము అధికారంలో ఉన్నపుడు కక్షసాధింపుల్లేదని కానీ నేడు ఓ మాజీ శాసనసభ్యుని ఇంటి ముందు చెత్తతొలగించాలన్నా సిబ్బంది భయపడుతున్నారని అని ప్రశ్నించారు. ఇక మార్కెట్ పేరుతో పాడుకున్న వారు రోడ్డుపక్కన బతుకు జీవనం కోసం తట్ట బుట్టా పెట్టుకున్న వారి నుంచి కూడా వసూలు చేసుకుంటున్న ఘనత అధికార పార్టీది అని ధ్వజమెత్తారు. ఆయనతో పాటు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాజీ కౌన్సిలర్లు ఉత్తరాజి శరవణ కుమార్, కంఠాఉదయ్ కుమార్,పసల సుమతి,,ఆర్కాటు ముత్తు,మాజీ ధర్మకర్తల మండలి సభ్యులుబుల్లెట్‌శ్యాం, మున్నారాయల్,పఠాన్ ఫరీద్,గోరా,పులి రామచంద్ర,కామి వెంకటేశ్వర్లు, మునికృష్ణారెడ్డి, అస్లాం, కొట్టె శరవణ, జుంటేషా, మహబూబ్ బాషా, పి.కృష్ణయ్య,జీలాని, బాబు,జయకృష్ణారెడ్డి, బాలాజి, షర్మిలా ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## శశికళకు డాక్టరేట్ ప్రధానం



తిరుపతి విద్య,ఆగస్టు 24 ప్రభాతవార్త:

ఎస్వీయూ హోంసైన్స్ విభాగపు పరిశోధక విద్యార్థిని వి. శశికళకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజమాణిక్యం తెలిపారు.ప్రొఫెసర్ కే. అనురాధ పర్యవేక్షణలో శశికళ ఇంప్యాక్ట్ ఆఫ్ లైఫ్ స్కిల్స్ ట్రైనింగ్ ఆన్ మెటాకాగ్నిటివ్ అవేర్‌నెస్ అండ్ అచీవ్‌మెంట్ మోటివేషన్ అమాంగ్ అడోలెసెంట్స్ అనే అంశంపై పరిశోధన చేపట్టారు. కౌమారదశలో ఉన్న విద్యార్థులపై జీవన నైపుణ్యాల శిక్షణ ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందనే అంశాన్ని ఆమె తన పరిశోధనలో ప్రధానంగా అధ్యయనం చేశారు. ముఖ్యంగా విద్యార్థుల్లో మెటాకాగ్నిటివ్ అవగాహన, సాధన ప్రేరణ వంటి అంశాల్లో జీవన నైపుణ్యాల శిక్షణ ద్వారా వచ్చే మార్పులను పరిశీలించారు.ఈ అంశానికి సంబంధించి అవసరమైన పరిశోధనను పూర్తి చేసి, పరిశోధన పత్రాలను విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఆమె పరిశోధనను పరిశీలించిన అనంతరం విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి తెలిపారు.శశికళకు డాక్టరేట్ లభించిన సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, అధ్యాపకులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెను ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో విద్యా, పరిశోధనా రంగాల్లో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.

## దుస్థితితో గంగమాంబాపురం-ఆలపాకం కండ్రిగ రోడ్డు

విజయపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:



## పగడాల హారం విరాళం

శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఆలయానికి సోమవారం తిరుపతికి చెందిన భక్తురాలు రూ.60వేల విలువ కల్గిన పగడాల హారాన్ని విరాళంగా అందించారు.తిరుపతికి చెందిన జాహ్నవిరెడ్డి, రుషిదీప్‌రెడ్డిలు శ్రీకాళహస్తిలో వెలసిన స్వామి అమ్మవార్ల నిత్యభక్తులు వారి మొక్కు తీర్చుకోవటానికి సోమవారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారు. ఆలయంలో అమ్మవారికి పగడాల హారాన్ని అందించాలని కోరారు. తయారు చేసిన హారాన్ని ఆభరణ ట్రస్టును పర్యవేక్షిస్తున్న నాగయ్య ద్వారా ఎఇఓ హేమామాలినికి అందించారు.ఈ కార్యక్రమాల్లో దుర్గా ప్రసాద్‌కూడా పాల్గొన్నారు. విరాళం అందించిన దాతలకు ఆలయంలో స్వాఇమ అమ్మవార్ల అంతరాలయ దర్శనంతో పాటు ప్రత్యేకంగా వేదపండితులచే ఆశీర్వచనాలు అందించారు.స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

## ఆచార్య పుల్లారెడ్డి మృతికి సంతాపం



తిరుపతి విద్య, ఆగస్టు 24 ప్రభాతవార్త:

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ శాస్త్ర విభాగంలో సుదీర్ఘకాలం ఆచార్యులుగా సేవలందించిన డాక్టర్ వి. పుల్లారెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతి పట్ల విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఆయన మృతికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు సంతాపం ప్రకటించారు. గ్రంథాలయ శాస్త్ర రంగానికి పుల్లారెడ్డి చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. ఆయన పర్యవేక్షణలో విశ్వవిద్యాలయంలో అనేక విలువైన గ్రంథాలు, పరిశోధనా రచనలు వెలు వడ్డాయని పేర్కొన్నారు. విద్యార్థులకు, పరిశోధకులకు ఆయన అందించిన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని తెలిపారు.గ్రంథాలయ శాస్త్ర విభాగ అభివృద్ధికి డాక్టర్ పుల్లారెడ్డి చేసిన కృషిని డీన్ ఆచార్య సురేంద్రబాబు, శాఖాధిపతి డాక్టర్ ప్రశాంతకుమారి వివరించారు. ఆయన సేవలను కొనియాడుతూ, ఆయన మృతి విశ్వవిద్యాలయానికి, గ్రంథాలయ శాస్త్ర రంగానికి తీరని లోటని పేర్కొన్నారు.డాక్టర్ పుల్లారెడ్డి భౌతికకాయాన్ని నేడు మంగళవారం ఉదయం 8 గంటల వరకు సందర్శించి నివాళులర్పించవచ్చని కుటుంబ సభ్యులు, విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు అధికారులు, అధ్యాపకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## వరదయ్యపాలెం ఎస్ఐకి... బీజేపీ ఫిర్యాదు

-ఏఈ నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలి

-బిజెపి పార్టీ మండల అధ్యక్షులు దిలీప్ రాయల్

వరదయ్యపాలెం, 24 ఆగస్టు ప్రభాతవార్త:



కాకినాడలో సాధిక్ ఖాన్ లవ్ జిహాదీ వేధింపుల కారణంగా ఏఈ నూకరాజు కుటుంబం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై భారతీయ జనతా పార్టీ వరదయ్యపాలెం మండలం తరపున వరదయ్యపాలెం ఎస్ఐకి ఫిర్యాదు చేసారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షులు దిలీప్ రాయల్ ఎస్ఐకి అర్జీ సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా జనరల్ సెక్రెటరీ సత్యవేడు మునికృష్ణయ్య, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆర్ మురళి మాట్లాడుతూ వైఎస్ఆర్‌సిపి కాకినాడ నాయకుని సిఫార్సుతో ఇంటర్నేషనల్ స్కూల్‌లో రైఫిల్ ట్రైనర్ గా చేరిన సాధిక్ ఖాన్, ఏఈ నూకరాజు మనవడు కార్తికేయ రెడ్డికి శిక్షణ ఇచ్చే పేరుతో ఆ కుటుంబంలోకి చొరబడ్డాడు. తల్లి సౌజన్యను వంచించి, ప్రైవేట్ ఫోటోలతో బ్లాక్ మెయిల్ చేసి కోట్ల రూపాయలు, బంగారం దోచుకున్నాడు. భర్తను విషం ఇచ్చి చంపి, ఆస్తి మొత్తం తన పేరున రాయాలని, కుటుంబం మొత్తం మతం మారాలని బెదిరించాడు. దీంతో ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. 12 ఏళ్ల బాలుడు కార్తికేయ బ్రతకడం వల్లే నిజం బయటకు వచ్చింది. ఇది ఒక్క కేసు కాదు. రాష్ట్రంలో జిమ్ములు, జుంబా డాన్సులు, బ్యూటీ పార్లర్లు, షాపింగ్ మాల్స్ కేంద్రంగా లవ్ జిహాదీ ముఠాలు పనిచేస్తున్నాయి. వీరికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఏ మసీదులు, మదర్సాలు శిక్షణ ఇస్తున్నాయి అని పోలీసులు విచారించడం లేదు. పోలీసులు కేసులను ప్రేమ, ఆర్థిక కేసులుగా చూసి కౌన్సిలింగ్ పేరుతో పంపేస్తున్నారు. అందువల్ల ఈ కేసులో వంచన, మోసం, దోపిడీ, హత్య, లవ్ జిహాదీ ఉగ్రవాదం కింద సాధిక్ ఖాన్‌ని కఠినంగా శిక్షించాలి, వరదయ్యపాలెం మండలంలో కూడా ఇటువంటి కేసులపై విచారణ జరిపి, యువతులకు రక్షణ కల్పించాలి. రాష్ట్ర డీజిపి, హోం మంత్రి ఈ ఘటనపై స్పందించాలని బీజేపీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు ఎల్ల అన్వేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు ఏసు, ఎంజె కుమార్, ఉపాధ్యక్షులు, సుబ్రహ్మణ్యం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితులకు ఇంటి పట్టాలు పంపిణీ చేయండి

సత్యవేడు, ఆగస్టు 24 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కొత్తమారికుప్పం పంచాయతీ అమావాసరెడ్డి కండ్రిగ ఎస్టీలకు, దళితులకు ఇంటి స్థలాలు కేటాయించడంతో పాటు శ్మశనానికి స్థలం చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. ఇంటి స్థలాల కోసం సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో ఎస్టీలు, దళితులు, పలువురు ఆందోళన చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ నాయకుడు మురళి మాట్లాడుతూ కొత్తమారికుప్పంలో సర్వే నెం.320 నుంచి 350 వరకు ఉన్న ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని, ఇంటి స్థలాలు లేని వారికి ఈ భూములను కేటాయించాలని ఆయన కోరారు. అలాగే శ్మశాన వాటికకు స్థలం లేకపోవడం వల్ల మృతి చెందుతున్న మృతదేహాలను పూడ్చడానికి ఇబ్బందులు పడుతున్నా రన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని బలోపేతం చేయాల్సిందిపోయి దానికి తూట్లు పొడిచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఊత్తుకోట నుంచి సత్యవేడు వరకు, నాగలాపురం నుంచి చిన్నపాండూరు వరకు రహదారులు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే పేదల పక్షాన నిలబడి ఆయా రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యంకల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ డీటీ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగార్జున, మురళి, పాపయ్య, చిరంజీవి, సురేష్, సదమయ్య, జోసెఫ్, వెంకటమ్మ, ఆశ, మారి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

## 26న ప్రజా కళావేదిక విశిష్ట అవార్డుల ప్రదానోత్సవం

తిరుపతి విద్య, ఆగస్టు 24 ప్రభాతవార్త:

ప్రజా కళావేదిక ఆధ్వర్యం లో ఈ నెల 26న సామా జిక సేవా కార్యకర్తలు, సీని యర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు, కెమెరా మెన్లకు విశిష్ట అవార్డులు, సన్మానా లు అందించ నున్నట్లు సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్, కవి అరవ జయపాల్ తెలిపారు.తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఉదయం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ప్రారంభమవు తుందని ఆయన వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగరపాలక సంస్థ కమిషనర్ ఏ. జయకృష్ణ, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. బహదూర్ మనోహర్ హాజరవుతారని తెలిపారు.అతిథులుగా ప్రముఖ శస్త్రచికిత్స నిపుణురాలు, ప్రొఫెసర్ డాక్టర్ రోజారమణి, సామాజిక కార్యకర్త, విశ్రాంత అధ్యాపకులు కాపిరెడ్డి కృష్ణారెడ్డి, సీనియర్ కవి, విశ్రాంత ప్రిన్సిపాల్ సి. నారాయణస్వామి పాల్గొంటారని జయపాల్ వివరించారు.సమాజ సేవ, జర్నలిజం, సాహిత్యం తదితర రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రజా కళావేదిక గత ఐదేళ్లుగా విశిష్ట అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా ప్రజా కళావేదిక ఎంపిక కమిటీ నిర్ణయించిన పలువురు సామాజిక సేవా కార్యకర్తలు, సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు, కెమెరామెన్లతో పాటు మరికొందరిని అవార్డులతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.సమాజానికి సేవ చేస్తున్న ప్రతిభావంతులను గుర్తించి వారిని గౌరవించడం ద్వారా మరింత మంది సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలన్నదే ప్రజా కళావేదిక లక్ష్యమని జయపాల్ తెలిపారు. అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రజలు, సాహితీవేత్తలు, కళాకారులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని అరవ జయపాల్ తెలిపారు.

## భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



తొట్టంబేడు,ఆగస్టు 24 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తికి సమీపంలోని రాజీవ్‌నగర్ సమీపంలో వెలసిన భగవాన్ వెంకటయ్యస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు సోమవారం ఆలయ నిర్వాహకులు పిజి తులసీ సారథ్యంలో నిర్వహించారు. ఇక్కడ ఎలాంటి కట్టడాలు, ఆలయాలు లేని సమయంలో మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు పిజె చంద్రయ్యశెట్టి భగవాన్ వెంకయ్యస్వామి ఆలయాన్ని నిర్మించారు.ఆయన వారసుడుగా పిజె తులసీ నేడు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ధార్మికతను బోధిస్తున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం ఆరాధనోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారరు.ఈ సందర్భంగా ఉదయం నుంచి మ ధ్యాహ్నం వరకు వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. హోమాలు,పూజలతో పరిసరాలు పునీతమయ్యాయి. ఈ కార్యక్రమాలకు హాజరైన అంజూరు తారక శ్రీనివాసులు మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు,అలాగే పేదలకు అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తరువాత ఆయన్ను ఆలయం తరఫున దుశ్శాలువతో సత్కరించి స్వామి తీర్థ ప్రసాదాలను అందించారు. అన్నదానంను అంజూరు గ్రామానికి చెందిన బత్తిరెడ్డి ఏర్పాటు చేయటం హర్షణీయమని అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు సురేష్,మొగరాల గణేష్, దాము,గిరిగౌడ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ ద్రౌపదీదేవి ఆలయంలో ధ్వజావరోహణం

పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా సోమవారం రాత్రి ధ్వజావరోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, అర్చనలు చేశారు. అలాగే అగ్నిగుండం, శాంతి పూజ కార్యక్రమం కూడా నిర్వహించారు. ఉభయ దాతలుగా దేవస్థానం(కోవిల్ కార్లు) రాచపాళెం మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఎస్.బాలసుబ్రహ్మణ్యంరాజు దేవస్థానం వారు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, ఆలయ కోవిల్ కార్ సాల్వాకం కిష్టప్ప మొదలి తదితరులు పాల్గొన్నారు.

## భారీగా ఎర్రచందనం దుంగలు పట్టివేత



పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త: పుత్తూరు మండలంలోని టీఆర్ కండ్రిగ అటవీ ప్రాంతంలో తెల్లగుట్ట వద్ద దాచి ఉంచిన 64 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రహస్య సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రి అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను అధికారులు గుర్తించారు. అధికారులను స్మగ్లర్లు గమనించి అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. పరారైన స్మగ్లర్ల కోసం అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్న అటవీశాఖ అధికారులు తెలిపారు.ఫారెస్టు రేంజ్ అధికారి మాధవి, పుత్తూరు ఫారెస్టు సెక్షన్ అధికారి రవిరావు, నారాయణవనం బీట్ అధికారి నూర్ అబ్దుల్‌లాల్, వడమాలపేట బీట్ అధికారి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్సీసీఏ సర్టిఫికెట్ల ప్రదానం



తిరుపతి విద్య,ఆగస్టు 24 ప్రభాతవార్త:

మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాలలో 2024-26 విద్యా సంవత్సరంలో ఎన్సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.29 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరంధామ నాయుడు, ఎన్సీసీ అసోసియేట్ అధికారి కదిరి రవి, 29 ఆంధ్ర బెటాలియన్ జేసీవో, ఇన్‌స్పెక్టర్ శివ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు పరంధామ నాయుడు మాట్లాడుతూ ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఎన్సీసీలో రెండేళ్లపాటు పొందిన అనుభవం, క్రమశిక్షణను జీవితంలో కొనసాగించాలని సూచించారు.ఎన్సీసీ నినాదమైన ఐక్యత, క్రమశిక్షణను అలవర్చుకుని ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్సీసీ అసోసియేట్ అధికారి కదిరి రవి మాట్లాడుతూ ఎన్సీసీ శిక్షణతో విద్యార్థుల్లో శారీరక, మానసిక సామర్థ్యాలు పెంపొందుతాయని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను దైనందిన జీవితంలో పాటించాలని సూచించారు. ఏ సర్టిఫికెట్‌తో లభించే ప్రత్యేక అవకాశాలను భవిష్యత్తులో సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.సీనియర్ ఉపాధ్యాయులు బండి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్సీసీ యూనిఫాం ధరించే అవకాశం పొందిన విద్యార్థులు దాన్ని సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. డాక్టర్ రామానాయుడు నమూనా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. హేమాద్రి మాట్లాడుతూ ఎన్సీసీ ద్వారా పొందిన శారీరక, మానసిక బలాన్ని కొనసాగిస్తూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షి ంచారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు బర్రె మృతి



సత్యవేడు, ఆగస్టు 24 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా సత్యవేడు మండలం జడేరి గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై బర్రె మృతి చెందింది. ఈ ప్రమాద సంఘటన సోమవారం మధ్యాహ్నం సంభవించింది. వివరాలు ఇలా... జడేరి గ్రామంలో నివసిస్తున్న గిరి సతీమణి విజయలత మేత కోసం బర్రెలను కనకదుర్గమ్మ ఆలయ సమీపానికి తీసుకెళ్లింది. అందులో మేత మేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్ళడంతో ముర్రా జాతికి చెందిన చూటు బర్రె విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ 70 వేలు ఉంటుందని బాధితురాలు విజయలత పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎర్త్ తీగ ద్వారా కరెంటు సరఫరా కావడం వల్లే బర్రె విద్యుత్‌షాక్‌కు గురైనట్టు ఆమె తెలిపారు.

## ఆధునిక గణితశాస్త్రంపై అధ్యాపకులకు శిక్షణ




తిరుపతి విద్య, ఆగస్టు 24 ప్రభాతవార్త:

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం లోని మదన మోహన మాళవీయ శిక్షక ప్రశిక్షణ కేంద్రం, గణితశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గణితశాస్త్రం,గణనాత్మక అధ్యయనాల్లో అభివృద్ధి చెందుతున్న అంశాలపై ఆరు రోజుల అధ్యాపకుల శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది.కార్యక్రమానికి జాతీయ సాంకేతిక సంస్థకు చెందిన ప్రొఫెసర్ అరుణాచల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయ విద్యా విభాగాధిపతి ప్రొ. రజనీకాంత్ శుక్లా, గణితశాస్త్ర విభాగాధిపతి డా. ఎ. చందులాల్, శిక్షక ప్రశిక్షణ కేంద్రం సంచాలకులు ప్రొ. ఎస్. మురళీధర రావు, అదనపు సంచాలకులు డా. ఎ. చారుకేశ్, హైదరాబాద్ సంచాలకులు, ప్రధాన శాస్త్రవేత్త డా. ముంజం శంకర్రావు తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 46 మంది అధ్యాపకులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో గణితశాస్త్రం, విజ్ఞానశాస్త్రంలో అభివృద్ధి చెందుతున్న ధోరణులు, ఆధునిక గణన పద్ధతులు, పరిశోధనా విధానాలపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు.కృత్రిమ మేధస్సు, క్వాంటం గణన, సమాచార విజ్ఞానం, గణిత నమూనాలు, సంఖ్యా పద్ధతులు, గణన సాధనాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధన, పరిశోధనలో సమర్థవంతంగా వినియోగించుకునే విధానాలను అధ్యాపకులకు వివరించనున్నారు.అధ్యాపకుల జ్ఞానాన్ని మరింత సుసంపన్నం చేయడం, బోధనా నైపుణ్యాలను పెంపొందించడం, పరిశోధనలో నూతన పద్ధతులను పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## మృత్యుంజయునికి విశేషాభిషేకాలు



శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సోమవారం మృత్యుంజయస్వామికి ప్రత్యేకా భిషేకాలు నిర్వహించారు. తరువాత ప్రత్యేకాలంకారం జరిపారు.ఈ ఆలయంలో వెలసిన మృత్యుంజయస్వామిని భక్తులు విశేషంగా

# తిరుపతి తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

## -ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి విద్య,ఆగస్టు 24 ప్రభాతవార్త:
నగర ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా,మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించడంతో పాటు భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాల యంలో నూతన కమిషనర్ జయకృష్ణ, అదనపు కమిషనర్ శారదాదేవితో ఆయన సమావేశమై నగర అభివృద్ధిపై చర్చించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ జయకృష్ణకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, తాగునీటి సరఫరా, భూగర్భ మురుగునీటి పారుదల, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులతో చర్చించారు. తిరుపతి నగరానికి నిరంతర తాగునీటి సరఫరా అందించడంలో భాగంగా ఎండీ పుత్తూరు నుంచి మంగళం వరకు రెండో పైపులైన్ ఏర్పాటు పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాల్సి న అవసరం ఉందన్నారు. అలాగే సుమారు 35 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ పాతబడిపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో లీకేజీలు ఏర్పడుతు న్నాయని పేర్కొన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నగర విస్తరణ, పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని కొత్త భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటుకు రూ.258 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ ప్రతిపాదనలను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఉన్న తిరుపతికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారని ఎమ్మెల్యే అన్నారు. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నగర పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. చెత్త సేకరణ, రహదారుల పరిశుభ్రత, మురుగునీటి సమస్యల పరిష్కారంలో నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. నగర అభివృద్ధికి సంబంధించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి వేగంగా పూర్తి చేసేందుకు అధికారులతో సమన్వయం చేసుకుంటామని కమిషనర్ జయకృష్ణ తెలిపారు. నగరంలోని ప్రధాన సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై త్వరలో సమీక్ష నిర్వహించాలని ఎమ్మెల్యే, కమిషనర్ నిర్ణయించారు.

## ప్రతి ఓటర్ సమస్యను పరిష్కరించాలి



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 24 ప్రభాతవార్త: ప్రస్తుతం సర్ చివరి దశకు వచ్చిందని అయితే ఓ ఒక్క అర్హులైన ఓటర్‌కు అన్యాయం జరగకుండా బిఎల్‌ఓలు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీకాళహస్తి తహశీల్దార్ టివి సుబ్రమణ్యం అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండంలోని 62 మంది బిఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఓటర్లకు అందజేసిన అభ్యంతరాలపై వచ్చిన ప్రతి స్పందన ఏమిటని తహశీల్దార్ బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. రాబోవు ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించిన ఈ సమావేశంలో తహశీల్దార్‌తో పాటు అడిషనల్ ఎఈఆర్‌ఓలు ఎంపిడిఓ పెంచల్ శ్యాం రవిచంద్రబాబుల పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా 62 మంది బిఎల్‌ఓలకు పలు అంశాలపై అవగాహనతో పాటు సూచనలు చేసారు. ఇప్పటి వరకు ఓటర్లుకు అందించిన అభ్యంతరాలపై విచారణ వేగవంతం చేయాలని సూచించారు. ఓటర్లను చైతన్యవంతుల్ని చేసివారి నడుంచి అభ్యంతరాలకు సంబంధించి ఆధారాలను సేకరించటంలో చొరవ చూపాలని సూచించారు. విచారణలో సేకరించిన ఆధారాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో కొత్త ఓటర్ల నమోదు ఫారం -6,మార్పులు చేర్పులు పామ్ -8 ఓట్ల తొలగింపు ఫారం 7షిఫ్టింగ్ దరఖాస్తులను త్వరగా చేయాలని బిఎల్‌ఓలు యుద్ధ ప్రాతిపదికపై పనులు చేసి పూర్తి చేయాలని తహశీల్దార్ సుబ్రమణ్యం సూచించారు.

## ఎయిడ్స్ కట్టడికి అవగాహనే ముఖ్యం

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త:



సమాజంలో రోజు రోజుకు పెరుగుతున్న ఎయిడ్స్ కట్టడికి ప్రజల్లో అవగాహన కల్పించటమే ముఖ్యమని స్టెప్స్ మేనేజర్ భాస్కర్ అన్నారు. సోమవారం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి ఆవరణలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పిలుపుమేరకు శ్రీకాళహస్తిలోని 'స్టెప్స్' స్వచ్ఛంద సేవా సంస్థ సారధ్యంలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఆసుపత్రి సిబ్బంది, అలాగే ఇక్కడకు వచ్చిన రోగులనుద్దేశించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ వివరించారు.ఈ సందర్భంగా స్టెప్స్ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాలకు ముందే శ్రీకాళహస్తిలో డాక్టర్ ప్రమీలమ్మ స్టెప్స్ అనే స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి ఎయిడ్స్ బాధితులకు సేవలందించారన్నారు.అప్పటి నుంచి ఆమె క్రమం తప్పకుండా ఎయిడ్స్ బాధితులకు అవగాహనతో పాటు మందులు అందిస్తూ నివారణకు కృషి చేస్తున్నారన్నారు.వందలాది మందికి ఆమె అవగాహన కల్పించారన్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి కృష్ణ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో స్టెప్స్ సేవలు అభినందనీయం అన్నారు.నేడు ఏ వ్యాధి అయినా త్వరగా నయంకావాలంటే రోగులకు అవగాహన ఉండాలన్నారు. ఇక ఎయిడ్స్ వచ్చిన తరువాత నివారణకు మందుల్లేవని నివారణ అంటే అవగాహనతో మెలగాలని సూచించారు. ఇక నేడు మందుల వాడకం అధికమౌతుందని దానికి దూరంగా ఉండాలని సూచించారు. ఎయిడ్స్ హెల్ప్‌లైన్‌కు నంబర్ 1097కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని వివరించారు.ఈ కార్యక్రమాల్లో వక్తలు ఐఐసి వాహన సేవల గురించి వివరించారు.

## రెండేళ్ళు గడచినా గడప దాటని హామీలు

### -ఆర్‌డిఓ కార్యాలయం వద్ద సిపిఐ ధర్నా



తొట్టంబేడు,ఆగస్టు 24 ప్రభాతవార్త: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నాయకులు ప్రజల్ని అరచేతిలో స్వర్గం చూపారు.మీ రాతల్ని మార్చేస్తామన్నారు. తీరా అధికారం చేపట్టి రెండేళ్ళు దాటినా హామీల అమలు గడపదాటలేదంటూ సిపిఐ ధ్వజమెత్తారు.సోమవారం ఆర్‌డిఓ కార్యాలయం వద్ద సిపిఐ జిల్లా కార్యదర్గ సభ్యులు జనమాల గురవయ్య,తులసీరాజన్‌ల పర్యవేక్షణలో హామీల అమలుకు ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రజలు అధికారం అందించి అధికార పీఠం మీద కూర్చొబెట్టిన తరువవాత హామీల మాట దేవుడెరుగు కనీసం'ధరల నియంత్రణలో కూడా' సర్కార్ విఫలమైందన్నారు. నాడు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమి హామీ ఉత్తుత్తిదిగా మారిందన్నారు.అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు నగదు ఇస్తామన్న హామీ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమాల్లో కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్, ఆర్ శ్రీనివాసులు, ఎం.నరసింహారావు, రాజయ్య, శివ,బత్తెమ్మ,మునెమ్మ, సుబ్బమ్మ, ధనలక్ష్మీ, వినాయకముని, తదితరులు హాజరయ్యారు. ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.ఆయన పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## గ్రామాల్లో కమిటిలతో బలోపేతం

ఏర్పేడు,ఆగస్టు 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో ఉన్న వన్నెకుల క్షత్రి



యుల అధికారాలను కొందరు దొడ్డిదారిలో అపహరిస్తున్నారని యువత చైతన్య వంతులు కావాలని సోమవారం మండలంలోని కొత్త వీరాపురంలో జరిగిన యువత సమావేశంలో పిలుపునిచ్చారు. జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు వినోద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేడు వన్నెకుల క్షత్రియుల ఓట్లతో అధికారం చేజిక్కించుకున్న రాజకీయ పార్టీలు తరువాత విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. యువత పార్టీలకు అతీతంగా ఐక్యమత్యంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరు చదువుకోవాలని ఆర్థికంగా ఎదగాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామంలో కమిటి ఏర్పాటు చేసారు. కమిటి గౌరవాధ్యక్షులుగా ఏ.మునిరెడ్డి, అధ్యక్షులుగా అనందరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏ.గురువారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్, కార్యదర్శిగా మునినాధ్‌రెడ్డి సహాయ కార్యదర్శిగా ఎన్ సుబ్రమణ్యం సహాయ కార్యనిర్వాహణ అధికారిగా ఎన్ చంద్రశేఖర్, కోశాధిదికారిగా లోకేష్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడుగా ఏ.మురళిని ఎన్నుకున్నారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిధులుగా జిల్లా అధ్యక్షులు ఎం.మునిశేఖర్ ఉపాధ్యక్షులు కేశవులు,జగదీష్‌లు హాజరయ్యారు.

## శివయ్యకు వెండి కిరిటం బహూకరణ



శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వయంభువుగా వెలసిన వాయులిం గేశ్వరునికి సత్యసా యిజిల్లా నల్లమాడ మండలం పులగం పల్లికి చెందిన భక్తులు ఒక కిలో వెండి కిరిటాన్ని బహూకరించారు.సోమవారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న పులగంపల్లికి చెందిన కె.వెంకటరెడ్డి వారి కుటుంబ సభ్యులు ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డితో తాము స్వామికి వెండికిరిటాన్ని ఇవ్వాలని కోరారు.దాంతో వారు వెంటనే ఆలయ ఎఇఓ హేమామాలినికి సమాచారం అందించారు. ఆమె సారధ్యంలో సేకరణ ఏర్పాట్లు చేసారు. వారు ఒక కిలో వవెండితో తయారుచేసిన వెండి కిరీటాన్ని అందించారు.వారికి ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తో పాటు వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.దర్శనంఏర్పాట్లునునాగయ్య, టెంపుల్‌ఇన్సెపెక్టర్ వెంకటస్వామి, ఎపిఆర్‌ఓ రవిలు పర్యవేక్షించారు.

## అక్స్‌ఫర్డ్ డిగ్రీకళాశాలలో ఉద్యోగమేళ...92 మంది ఎంపిక



శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో చదువుకున్న యువతీ యువకులకుఉద్యోగవకాశాలుకల్పించుటకు విద్యా సంస్థలు తమ వంతు కృషి చేస్తున్నారు. ఆది నుంచి ఆక్స్ ఫర్డ్ డిగ్రీ కళాశాల నిర్వాహకులు చెవిరెడ్డి మధుసూధనరెడ్డి తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగవకాశాలు అందిస్తున్నారు.ఈ నేపధ్యంలో సోమవారం వివిధ కంపెనీలకుస ంబంధించిన ప్రతినిధులను రప్పించారు. వివిధ గ్రూపుల నుంచి 92 మందిని ఎంపిక చేసినట్లు మధుసూధనరెడ్డి వివరించారు.చాతుర్యాలో 10 మంది, కామెట్‌లో 40మంది, ఎదుట్రీలో 4గురు ఎన్ఎన్ ఇన్స్టుమెంట్స్‌లో 12 మంది డిక్సన్‌లో ఆరుగురు ఆల్‌సెట్‌లో 20 మంది ఎంపికైనట్లు వివరించారు. వివిధ సంస్థలు ఆఫర్ లెటర్స్‌ను అందించారు.ఈ కార్యక్రమాల్లో ఆధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు

## యువతకు ఉపాధి అవకాశాలు



తొట్టంబేడు,ఆగస్టు 24 ప్రభాతవార్త: ఉద్యోగాల కల్పనలో నారాలోకేష్ దూకుడుగా పరుగులు తీస్తున్నారని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు అన్నారు. సోమవారం తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికిమూల స్థంభాలైన యువత రానికి ఉపాధి అవకాశాలు కల్పించటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతలో ముందు వెళుతున్న మంత్రి నారాలోకేష్ ఉద్యోగాల కల్పనలో దూకుడు చూపిస్తూ యువతను ఉత్సాహంలో ఉన్నారన్నారు. ఎన్‌డియే కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు భర్తీపై ప్రతి ఏడు జాబ్‌క్యాలండర్ విడుదల చేసి నియామక ప్రక్రియను తగిన సమయంలో పూర్తి చేయటానికి చర్యలు చేపట్టడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసిన విద్యాశాఖమంత్రి లోకేష్‌ఈ ఏడాది మళ్ళీ 10,060 ఉద్యోగాలు భర్తీ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం జాబ్ క్యాలండర్‌ను ప్రకటించటం ఆయన చిత్తశుద్ధి పట్టుదలకు నిదర్శనం అన్నారు. ఈ విలేకరుల తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ దశరధాచ్చారి, యం. ఉమేష్‌రావు, డివి నారాయణ, కోట చంద్రశేఖర్,సయ్యద్‌చాంద్‌బాషా,గాజులభగత్, నూర్ మహమ్మద్,శంకరయ్య, సాయికుమార్ పాల్గొన్నారు.

# వేద విశ్వవిద్యాలయంలో... సంస్కృత వారోత్సవాలు ప్రారంభం




తిరుపతి విద్య, ఆగస్టు 24 ప్రభాతవార్త:
జాతీయ సంస్కృత దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న సంస్కృతోత్సవ 2026 సంస్కృత వారోత్స వాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.వారోత్సవాల ప్రారంభం సందర్భంగా విశ్వవిద్యాలయ విద్యా ప్రాంగణం నుంచి కార్యక్రమ వేదిక వరకు సంస్కృత గ్రంథాల శోభాయాత్ర నిర్వహించారు. వేదాలు, వేద భాష్యాలు, ఆగమ, మీమాంస, ధర్మశాస్త్ర గ్రంథాలను పల్లకీలలో ఉంచి ఊరేగించారు. సుమారు 400 మంది విద్యార్థులు వేద మంత్రాలను ఉచ్చరిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు.అనంతరం జరిగిన ప్రారంభ సభలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సాహిత్య విభాగ ప్రొఫెసర్ డా. చక్రవర్తి రంగనాథన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్కృత సాహిత్యంలో నిక్షి ప్తమైన జ్ఞానం సమస్త మానవాళి శ్రేయస్సుకు ఉపయోగపడుతుందని అన్నారు. భారతీయ జీవన విధానానికి సంబంధించిన అనేక శాస్త్ర గ్రంథాలు సంస్కృతంలోనే ఉన్నందున వాటిని పరిరక్షి ంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాల శోభాయాత్ర, విద్యార్థుల వేద పఠనం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి అధ్యక్షోపన్యాసం చేస్తూ సంస్కృతం కేవలం భాష మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు, శాస్త్ర విజ్ఞానానికి ఆధారమని అన్నారు. విద్యార్థులు సంస్కృతాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకుని ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక సమాజానికి అనుసంధానించాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు.వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 31 వరకు వేద మంత్ర అంత్యాక్షరి, శ్లోక అంత్యాక్షరి, నాటక ప్రదర్శనలు, సంస్కృత ప్రశ్నోత్తరి, ఆశుభాషణం, కావ్యగోష్ఠి తదితర విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముగింపు సమావేశంతో సంస్కృత వారోత్సవాలు ముగియనున్నాయి.కార్యక్రమంలో విద్యా వ్యవహారాల డీన్ డా. రాధేశ్యామ్, రిజిస్ట్రార్ బలభద్ర ఉపాధ్యాయ, సాంస్కృతిక కమిటీ సమన్వయకర్త డా. గిరిజా ప్రసాద్ షడంగి, అధ్యాపకులు, సిబ్బంది,

# తిరుపతి డివిజన్

## తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మికుల ధర్నా

తిరుపతిరూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:




రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సిపిఐ నాయకులు విశ్వనాథ్, జయరామయ్య మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నదియా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీలకు భూములు పంపిణి చేయాలని, ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల సాగు భూమి కల్పించాలని కోరారు. దళిత గిరిజన గ్రామాల్లో భూముల సమస్యలు పరిష్కరించాలని, కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, పేదలకు ఇవ్వాలని నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

## పైడిపల్లిలో కాలువపోరంబోకు స్థలం ఆక్రమణకు యత్నం

### -స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించిన రెవెన్యూ..హెచ్చరిక బోర్డు ఏర్పాటు




తిరుపతిరూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం పైడిపల్లి గ్రామ లెక్కదాఖల సర్వేనెంబర్ 187లో వున్న కాలువ పోరంబోకు స్థలం ఆక్రమణ, పంచాయతీలో కలకలం రేపింది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆ స్థలం కాలువ స్థలంగా గుర్తించారు. కాలువ స్థలం కబ్జా గురికాకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు కాలువ పోరంబోకు స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గతంలో కూడా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికి ఆ బోర్డును తొలగించారని స్థానికులు ఆరోపించారు. కాల్వ, కుంట, డికెటి, అనాధీనం, కశంకాలువ తదితర భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని స్థానికులు కోరారు.

## రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల ప్రారంభం



తిరుపతి క్రీడ, ఆగస్టు 24 ప్రభాతవార్త: తిరుపతిలో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలను శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించి, పోటీల్లో క్రీడాస్ఫూర్తితో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు.

## అనుచిత వ్యాఖ్యలు చేయడం భూమనకు తగదు

తిరుపతి హెల్త్, ఆగస్టు 24 ప్రభాతవార్త:



రెండు పర్యాయాలు టిటిడి బోర్డు చైర్మన్‌గా, ఏడు సంవత్సరాల పాటు తిరుపతి శాసనసభ్యుడిగా పనిచేసిన భూమన కరుణాకర్‌రెడ్డి బిసి వర్గానికి చెందిన జిల్లా కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని తిరుపతి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు గుంజి మదన్మోహన్ అన్నారు. సోమవారం స్థానిక కరకంబాడి రోడ్డులోని తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకంటూ ఒక స్థాయి ఉన్న కరుణాకర్‌రెడ్డి తిరుపతి జిల్లా ప్రథమ పౌరుడు, జిల్లా మెజిస్ట్రేట్ అయినటువంటి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను అసభ్యంగా బెదురుంపు దారులతో గౌరవం లేకుండా దాకు మంగళ్ సింగ్ అని సంబోధించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి డి. రమణ, వడ్డెర కుల నాయకుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు టి రవీంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెంగల్ రాయులు, గౌరవ అధ్యక్షుడు రోశయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి కె. లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యువ పారిశ్రామికవేత్త మల్లికార్జున్‌కు అభినందనలు

వరదయ్యపాలెం, ఆగస్టు 24 ప్రభాతవార్త:
శ్రీసిటీలో స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించిన పరుచూరి మల్లికార్జున్ నాయుడు, యువ పారిశ్రామికవేత్త, టీడీపీ యువ నాయకుడు పరుచూరి మల్లికార్జున్ నాయుడును మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ నాయుడు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీ సిటీలో స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను స్థాపించి పారిశ్రామిక రంగంలో అడుగులు వేస్తున్న మల్లికార్జున్ నాయుడు గురించి వెంకయ్యనాయుడు అభినందనలు తెలిపారు. మంచి పరిశ్రమను స్థాపించి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించిన వెంకయ్య నాయుడు, పారిశ్రామిక రంగంలో అంచెలంచెలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అదే సమయంలో సమాజ హితం కోసం కూడా తన వంతు కృషి చేస్తూ ముందుకు సాగాలని మల్లికార్జున్ నాయుడికి సూచించినట్లు సమాచారం. యువ పారిశ్రామికవేత్తగా, యువ నాయకుడిగా మల్లికార్జున్ నాయుడు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## శివయ్య సేవలో అలహాబాద్‌హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని సేవలో సోమవారం ఆలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేజ్ ప్రతాప్ తివారి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు.వారికి ఆలయం దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ మేరకు ఎఇఓ లోకేష్‌రెడ్డి, పిఆర్‌ఓ రవిలు స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్‌లుపర్యవేక్షించారు.జస్టిస్ ఆలయం నిర్వహణకు సంబంధించి అభినందించారు.

## పవన్ కోలుకోవాలి...ప్రజలకు అందుబాటులో ఉండాలి

### -తలనీలాలు సమర్పించుకున్న చైర్మెన్



శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త: జనసేన పార్టీ వ్యవస్థాపకులు,అధ్యక్షులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సంపూర్ణంగా కోలుకోవాలని కోరుకుంటూ శ్రీకాళహస్తీశ్వరునికి తలనీలాలు సమర్పించుకున్నారు. పవన్ కళ్యాణ్ వైద్యసేవల కోసం కేరళకు వెళ్ళటంతో అక్కడ వైద్యసేవలతో పూర్తిగా కోలుకోవాలని శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు.అలాగే అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు జరిపించారు. మృత్యుం జయస్వామి ఆలయం వద్ద పూజలు జరిపిం చారు. తరువాత తలనీలాలు సమర్పించుకు న్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుని సేవలు రాష్ట్ర ప్రజలకు ఎంతో అవసరం అన్నారు.త్వరలో తమ నాయకుడు కోలుకొని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేయటమే కాకుండా గ్రామాల్లో కూడా జనసేన పార్టీ జజెండా ఎగురవేస్తారని వివరించారు.